ఈనాడు ములుగు
శనివారం అక్టోబరు 5, 2024
5


కర్షకులకు వాగు కష్టాలు..!

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి నుంచి కొండాయి గ్రామానికి వెళ్లే మార్గంలో దొడ్ల గ్రామం వద్ద జంపన్న వాగుపై నిర్మించిన వంతెన గతేడాది వచ్చిన భారీ వరదలకు కూలిపోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ మార్గంలో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన మేడారం మహాజాతర సమయంలో వంతెనకిరువైపులా బస్తాలు పేర్చి రాకపోకలకు వీలుగా తాత్కాలికంగా మట్టి రోడ్డును నిర్మించారు. మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ చూపి రూ.9.50 కోట్ల అంచనా వ్యయంతో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి ఏప్రిల్‌లో పనులకు శంకుస్థాపన చేశారు. ఈ వర్షాకాలంలో ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండటానికి రూ.25 లక్షల వ్యయంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. పనుల్లో అలసత్వం కారణంగా ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి పూర్తిగా ధ్వంసం కావడంతో.. మళ్లీ రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం నడుములోతు నీటిలో వాగు దాటుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. కొండాయికి వెళ్లేందుకు కర్షకులు యూరియా బస్తాలను తలపై పెట్టుకుని వాగు దాటుతుండగా 'ఈనాడు' తీసిన చిత్రమిది.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే, ఏటూరునాగారం


యూరియా బస్తా తలపై పెట్టుకుని వెళ్తున్న రైతులు

ఓంకార రూపిణి.. నమోస్తుతే..!


వెంకటాపూర్ నల్లగుంటలో..


గోవిందరావుపేట గోవిందరాజస్వామి దేవాలయంలో


ఏటూరునాగారం పట్టణంలోని రామాలయంలో..


మంగపేటలో..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారిని ప్రతిష్ఠించిన మండపాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం అమ్మవారు గాయత్రీమాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. న్యూస్‌టుడే యంత్రాంగం

మరిన్ని చిత్రాలు.. 7లో..


వాజేడు మండలం ధర్మారంలో


వెంకటాపురం మండల కేంద్రంలో..

శుద్ధజలం సరఫరా లక్ష్యం..!

జిల్లా వివరాలు

- మండలాలు: 9
- పంచాయతీలు: 174
- ఆవాసాలు: 490
- ఇంటింటి కనెక్షన్లు: 89,934
- పైపులైన్ విస్తీర్ణం: 1,198.63 కి.మీ
- నీటి ట్యాంకులు: 601
- చేతి పంపులు: 2,184
- సింగిల్ ఫేస్ మోటార్లు: 412
- పీడబ్ల్యూఎస్ స్కీమ్ మోటార్లు: 371
- మంచినీటి సహాయకులు: 248

వెంకటాపురం(ములుగుజిల్లా), న్యూస్‌టుడే: ఇంటింటికి సురక్షిత జలం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. కన్నీటి కష్టాలను అధిగమించడంతో పాటు నాణ్యమైన నీటిని అందించేందుకు రూపకల్పన చేసింది. కేంద్ర ప్రభుత్వ అమల్లోకి తెచ్చిన 'జల్ జీవన్ మిషన్' కార్యక్రమానికి అనుబంధంగా రాష్ట్రంలో మిషన్ భగీరథ శుద్ధజలం సరఫరాపై దృష్టి సారించింది. పల్లెల్లో నీటి ఇబ్బందులు తావులేకుండా ఏ చిన్న సమస్య వచ్చినా తక్షణమే పరిష్కరించుకునేలా ప్రణాళిక రూపొందించి పంచాయతీల్లో మంచినీటి సహాయకులను నియమించింది. తాగునీటి సరఫరా, పథకాల నిర్వహణ, మరమ్మతులపై శిక్షణ ఇస్తోంది.


మంచినీటి సహాయకులకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనీలు

పంచాయతీకొక సహాయకుడు

కాలానుగుణంగా తాగునీటి సరఫరాలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పల్లెస్థాయిలో బావుల్లో నీరు లేకపోవడంతో ఆటంకాలు ఎదురవుతున్నాయి. వానాకాలంలోనే మంచినీరు కలుషితమై ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. వీటన్నింటికీ పరిష్కారం చూపేందుకు పంచాయతీకొక మంచినీటి సహాయకులను తీసుకొచ్చారు. మేజర్ పంచాయతీల్లో ఆవాసాలకనుగుణంగా ఇద్దరిని నియమించారు. జిల్లా వ్యాప్తంగా 174 పంచాయతీలకు గాను 248 సహాయకులను అర్హత ఆధారంగా ఎంపిక చేశారు. బహుళ నైపుణ్యం కలిగిన కార్మికుల(మల్టీ స్కిల్ వర్కర్స్)గా తీసుకున్నారు.

కొనసాగుతోన్న శిక్షణ

ప్రభుత్వ ఆదేశాలతో మంచినీటి సహాయకులకు శిక్షణ ఇచ్చే ప్రక్రియను చేపట్టారు. జిల్లాలో అనుభవజ్ఞులైన నలుగురిని ఎంపిక చేసి గత నెలలో హైదరాబాద్‌లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో మాస్టర్ ట్రైనీలుగా శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం వారు జిల్లా వ్యాప్తంగా సహాయకులకు తర్ఫీదు ఇస్తున్నారు. ఇప్పటికే వెంకటాపురం, వాజేడు, ములుగు, వెంకటాపూర్ మండలాల్లో మొదటి విడత శిక్షణ పూర్తయింది. ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, తాడ్వాయి, గోవిందరావుపేట మండలాల్లో రెండో విడత కొనసాగుతోంది. నాలుగు రోజుల శిక్షణలో పైపులైన్ల లీకేజీల నియంత్రణ, మంచినీటి సరఫరా, మోటార్ల మరమ్మతులు, చేతిపంపులు బాగు చేయడం, నీటి నాణ్యత పరీక్షలపై తర్ఫీదు ఇస్తున్నారు.

మెరుగైన సేవలు



- సనుగొండ వెంకటేశ్, వీఆర్‌కేపురం, వెంకటాపురం

తాగునీటి ట్యాంకుల శుభ్రత, నీటి నాణ్యత పరిశీలనపై చైతన్యం కలిగింది. ఐరన్, లవణాలు, నైట్రేట్, గాఢత తదితర అంశాల గుర్తింపు సులభమైంది. మిషన్ భగీరథ నీటిపై ప్రజల్లో ఉన్న సందేహాలను సైతం నివృత్తి చేసేందుకు ఈ శిక్షణ ఉపయోగపడనుంది.

ఎంతో ఉపయోగం



- కుర్సం శంకర్, రామచంద్రాపురం, వెంకటాపురం

నాలుగు రోజుల శిక్షణ ఎంతో ఉపయోగపడింది. చేతి పంపులు బాగు చేయడం, పైపులైన్ల లీకేజీలను అరికట్టడం, తాగునీటి ట్యాంకుల్లో శుభ్రత, శుద్ధ జలం సరఫరాకు మిలితం చేయాల్సిన సామగ్రిపై అవగాహన వచ్చింది. తాగునీటి సరఫరా సైతం మెరుగుపడనుంది.

త్వరితగతిన పరిష్కారం

- వెంకటసతీశ్, డీఈఈ, మిషన్ భగీరథ

త్వరితగతిన సమస్యలు పరిష్కారమవుతాయి. పల్లెల్లో నిరంతరం సహాయకులు అందుబాటులో ఉండటంతో సేవలు మరింత మెరుగ్గా అందనున్నాయి. తాగునీటి పరీక్షలు కొనసాగుతున్నాయి. ప్రజలకు సకాలంలో మంచినీటి సరఫరా జరుగుతుంది.

చేపల పెంపకానికి ప్రత్యేక ప్రణాళిక

ములుగు, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో గిరిజనులు చెరువుల్లో చేపలు పెంచడానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసి చేప పిల్లలను పంపిణీ చేస్తున్నదని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ములుగు మండలం జాకారం గ్రామంలోని ఊర చెరువులో శుక్రవారం చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. జిల్లాలో చెరువులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. చేపల పెంపకానికి ఈ ప్రాంతం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మత్స్యకారులను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక ప్రణాళికతో చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారని వివరించారు. ముదిరాజ్ సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, జిల్లాలో బాగుగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెరువుల్లో చేపల పెంపకానికి చేప పిల్లలను పూర్తి రాయితీతో సరఫరా చేస్తున్నదని తెలిపారు. పంపిణీ కార్యక్రమాన్ని ఒక పండగలా జరుపుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో అధిక మొత్తంలో జిల్లాకు చేప పిల్లలను కేటాయించినట్లు చెప్పారు. అన్నిప్రాంతాల్లో మత్స్యకార భవనాలు నిర్మించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. 80-11 ఎంఎం సైజు కలిగిన మూడు రకాల 18,700 చేప పిల్లలను చెరువులో వదిలారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్య సహకార సంఘం ఛైర్మన్ మెట్టు సాయికుమార్, జిల్లా సంఘం ఛైర్మన్ సాద రఘు, తహసీల్దారు విజయభాస్కర్, ఎంపీడీవో రామకృష్ణ, జిల్లా మత్స్యశాఖాధికారి అవినాష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


ఊర చెరువులో చేప పిల్లలను వదులుతున్న మంత్రి సీతక్క

సమన్వయంతో నాణ్యమైన వైద్య సేవలు


వైద్య సేవలపై ఆరా తీస్తున్న రాష్ట్ర వైద్యశాఖ సంచాలకులు డాక్టర్ రవీంద్రనాయక్

ములుగు, న్యూస్‌టుడే: రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ రవీంద్రనాయక్ శుక్రవారం సాయంత్రం ములుగు జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. అక్కడున్న రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలో ఏమైనా ఇబ్బందులున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలోని పిల్లల వార్డును, ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌తో పాటు ఇతర వార్డుల్లో తిరిగారు. రోగుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు ఉన్నాయా అనేది పరిశీలించారు. ఆసుపత్రి సిబ్బందితో సమావేశమై వారి నుంచి వివరాలు సేకరించారు. వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని, అలాంటప్పుడే రోగులకు నాణ్యమైన వైద్యం అందుతుందని సూచించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎ. అప్పయ్య, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మోహన్‌లాల్, ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ విపిన్‌కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపురం విద్యుత్తు ఏఈ సస్పెన్షన్

ములుగు న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అలసత్వం కారణంగా ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం విద్యుత్తు ఏఈ ప్రశాంత్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు సీఎండీ వరుణ్‌రెడ్డి శుక్రవారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా.. మంగపేట మండలం జబ్బోనిగూడెం గ్రామాన్ని గురువారం రాత్రి రాష్ట్ర మంత్రి సీతక్క ఆకస్మికంగా సందర్శించిన సమయంలో కరెంటు లేదు. ఎప్పటి నుంచి సరఫరా నిలిచిందని గ్రామస్థులను అడగ్గా, రెండు రోజులుగా లేదని చెప్పారు. ఆగ్రహించిన మంత్రి అక్కడి నుంచే ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డికి ఫోన్ చేసి ఏఈపై చర్యలు తీసుకోవాలని సూచించడంతో.. ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్‌కు గురైన ఏఈ విధుల్లో చేరి ఏడాదిన్నర మాత్రమే అవుతున్నట్లు సమాచారం.

క్షేత్రస్థాయిలో విచారణ చేయాలి


మాట్లాడుతున్న పాలనాధికారి దివాకర

ములుగు, న్యూస్‌టుడే: జిల్లాలో ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని జిల్లా పాలనాధికారి టీఎస్. దివాకర తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మొత్తం 4,980 మంది ఇంటి స్థలాలు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేయగా, 367 దరఖాస్తుల విచారణ పూర్తయిందన్నారు. పెండింగ్‌లో ఉన్న 4,613 దరఖాస్తుల విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఎవరైనా పోర్టల్‌లో నమోదు చేయనట్లయితే ప్రభుత్వం మళ్లీ అవకాశం కల్పిస్తుందని తెలిపారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల ద్వారా 19 బృందాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. బృందాలు తక్షణమే గ్రామాలలో దరఖాస్తుల విచారణ చేపట్టాలని సూచించారు. అధికారులకు ప్రజలు ధ్రువపత్రాలు అందజేయాలని, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పేర్కొన్నారు. ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్, సంపత్‌రావు, అదనపు కలెక్టర్ సీహెచ్. మహేందర్‌జీ, ఈడీఎం దేవేందర్, రెవెన్యూ, పంచాయతీ, నీటిపారుదల శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూలు ప్రవేశాల గడువు పెంపు

ములుగు, న్యూస్‌టుడే: ఓపెన్ పది, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం ఈనెల 31 వరకు గడువు పెంచినట్లు ములుగు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ క్యాతం రాజేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశాల కోసం అధ్యయన కేంద్రానికి చేరుకొని ఫీజు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు 9948427050 నెంబరులో సంప్రదించాలని కోరారు.

రైతు ధర్నా విజయవంతం..

భారాస శ్రేణుల్లో ఉత్తేజం

తొర్రూరు, న్యూస్‌టుడే: ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేయాలని భారాస నేతలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని అమ్మాపురం క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం నిర్వహించిన రైతు మహా ధర్నా విజయవంతం కావడం ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. వేలాదిగా తరలివచ్చిన రైతులతో ధర్నా ప్రాంగణం కిక్కిరిసి పోయింది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో ముఖ్య అతిథిగా మాజీమంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు అమలుచేయాల్సిందేనని స్పష్టం చేశారు. అనంతరం ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ కీలక నేతలు ప్రసంగించారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, వేదికపై పార్టీ నాయకులు


సభకు హాజరైన రైతులు

☛ రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ.15 వేలు రైతు భరోసా, వరి ధాన్యానికి రూ.500 బోనస్ అంటూ బోగస్ మాటలు చెప్పిన మోసకారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. 11 పర్యాయాలు రూ.72 వేల కోట్ల రైతుబంధును అందించిన ఘనత భారాస ప్రభుత్వానికే దక్కుతుంది.

- పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే

☛ తొర్రూరులో గురువారం ఓ వస్త్ర దుకాణం ప్రారంభోత్సవంలో వేదిక కూలిపోయిన మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో విధ్వంసం సృష్టిస్తున్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటపడి వేటాడుతాం.

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి

☛ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తుంగలో తొక్కి రాష్ట్రంలో దుర్మార్గ పాలన కొనసాగిస్తున్నారు. రుణమాఫీపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎం రేవంత్‌రెడ్డిలు పొంతనలేని లెక్కలు చెబుతున్నారు. ఈ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు.

- శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి


☛ నేటికి 30 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదు. సీఎం రేవంత్‌రెడ్డి బ్రోకర్ మాటలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారు. తొర్రూరులో 100 పడకల ఆసుపత్రి, పాలకుర్తిలో 50 పడకల ఆసుపత్రి పనుల ఊసేలేదు. ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు ప్రభుత్వంపై పోరాడుతూనే ఉంటాం.

- మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఆర్టీసీలో మహాలక్ష్మి!



● సంస్థ అభివృద్ధిలో కీలకపాత్ర



ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల బాట పట్టింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆదాయం రెట్టింపయ్యింది. అధికారులు సంస్థను అభివృద్ధిలోకి తీసుకురావడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. వరంగల్ రీజియన్ పరిధిలో ఉత్తమ సేవలతో పాటు మంచి లాభాలు ఆర్జించడంలో మహిళా ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. కండక్టర్ నుంచి ఉన్నతాధికారుల వరకు అన్ని విభాగాల్లో సత్తా చాటుతున్నారు.

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే

ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది డిపోల పరిధిలో మహిళా కండక్టర్లు 479 మంది ఉన్నారు. ఇతర విభాగాల్లో పని చేసే వారు మరో 32 మంది ఉంటారు. వీరిలో ప్రధానంగా వరంగల్ 2, జనగామ, తొర్రూరు, నర్సంపేట డిపో మేనేజర్లు జ్యోత్స్న, స్వాతి, పద్మావతి, ప్రసూనలక్ష్మీ, వరంగల్ 2 డిపో అసిస్టెంట్ మేనేజర్ జ్యోత్స్న, హనుమకొండ డిపోలో నాజియా, ఆర్‌ఎం కార్యాలయంలో సరస్వతి, పరకాలలో కృష్ణకుమారి, నర్సంపేటలో భవానీ, తొర్రూరులో రజిత, ఎంఫలు వరంగల్ 2 డిపోలో అమల, పరకాలలో రాజశ్రీ, ఆర్ఎం కార్యాలయంలో మహితలు కీలక పదవుల్లో ఉండి ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.



మహిళా శక్తి ఇలా..

- పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఎక్కువ మంది మహిళా కండక్టర్లే విధులు నిర్వహిస్తున్నారు.
- ఆర్టీసీలో కార్మికులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఉన్నతాధికారులు ప్రతి డిపోకు ఇద్దరు సభ్యులతో కూడిన సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో ఉమ్మడి జిల్లాలోని 9 డిపోల్లో ఒక పురుషుడితో పాటు ఒక మహిళ సభ్యులుగా ఉన్నారు. తొర్రూరు, పరకాల, వరంగల్ 2, జనగామ డిపోల్లో ఇద్దరు సభ్యులు మహిళలే ఉన్నారు. వీరు డిపోల స్థాయిలో కార్మికులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను డీఎం, ఆర్‌ఎంలకు చేరవేసి వాటి పరిష్కారం దిశగా కృషి చేస్తున్నారు.
- రీజియన్‌లో మహిళా సిబ్బంది విశ్రాంతి తీసుకునేందుకు ప్రతి డిపోలో ప్రత్యేకంగా విశ్రాంతి గదులను ఏర్పాటు చేశారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి డిపోలో ఇద్దరు సహాయకులు సైతం ఉంటారు. వీరు మహిళా సిబ్బందికి వారానికి, నెలకోసారి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన వారికి హనుమకొండలోని డిస్పెన్సరీ నుంచి మందులు, తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రిలో అధునాతన చికిత్స అందించేలా కృషి చేస్తున్నారు.


వరంగల్ 1 డిపోలో మహిళల కోసం ఏర్పాటు చేసిన విశ్రాంతి గది

ఈ సేవలు అందిస్తే మేలు

- రోజుకు 8 గంటల పని దినం కల్పించాలి
- రాత్రి 8 గంటల వరకు తప్పని సరిగా విధులు ముగిసేలా చర్యలు తీసుకోవాలి.
- ప్రతి నెలా ఆరోగ్య సమస్యలకు మూడు రోజుల పాటు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలి.
- పని ఒత్తిడి నివారణకు సిబ్బంది, బస్సుల సంఖ్యను పెంచాలి.
- సిటీ బస్సుల్లో మాదిరిగా స్టాండింగ్ అలవెన్సులు అందించాలి.
- స్ప్రెడ్ ఆఫ్ డ్యూటీ (ఒక రోజు విధులు నిర్వహిస్తే మరో రోజు సెలవు వచ్చేలా) విధులు కేటాయించాలి.

ఉన్నతాధికారుల సహకారంతో ..



- జ్యోత్స్న, డిపో మేనేజర్, వరంగల్ 2

ఆర్టీసీ ఉన్నతాధికారుల ప్రోత్సాహంతో డిపో అభివృద్ధికి కృషి చేస్తున్నాం. వారి సూచనలను ఎప్పటికప్పుడు అమలు చేస్తూ ముందుకు సాగుతున్నాం. మహిళా సిబ్బంది పురుషులతో సమానంగా విధులు నిర్వహిస్తూ డిపో అభివృద్ధికి పాటు పడుతున్నారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్నాం.



- బి.సుధారాణి, కండక్టర్ వరంగల్ 1

మహాలక్ష్మి పథకం వచ్చాక బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో కొంత ఒత్తిడితో పాటు అనారోగ్యానికి గురవుతున్నాం. అయినప్పటికీ సంస్థను తమ సొంతంగా భావించి దాని అభివృద్ధికి కృషి చేస్తున్నాం. రద్దీని తట్టుకుంటూ విధులు నిర్వహిస్తున్నాం. మా డిపో మేనేజర్ సూచనలతో ఇబ్బందులు లేకుండా పని చేస్తున్నాం.

పనిభారం ఉన్నా సమర్థంగా విధులు



- రజిత, ట్రాఫిక్ ఎస్టీఐ, తొర్రూరు డిపో

ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. దీంతో మహిళా కండక్టర్లు ఒత్తిడికి గురవుతున్నారు. పని భారం పెరుగుతున్నా సమర్థంగా విధులు నిర్వహిస్తున్నారు. వారికి కేటాయించిన టార్గెట్ పూర్తి చేస్తున్నారు. సంస్థ లాభాల్లో వారి కృషి కీలకం.


త్రివేణి సంగమం

● మరో 8 నెలల్లో

సరస్వతి పుష్కరాలు

● ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తే మేలు

న్యూస్‌టుడే, కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వర క్షేత్రం వద్ద అంతర్వాహినిగా పేరున్న సరస్వతి నదికి మరో ఎనిమిది నెలల్లో పుష్కరాలు రాబోతున్నాయి. ప్రతి పన్నెండేళ్లకోసారి వచ్చే సరస్వతి పుష్కరాలు వచ్చే ఏడాది మే 15 నుంచి 26 వరకు జరుగుతాయి. 2013లో ఈ నదికి పుష్కరాలు జరిగాయి. కాళేశ్వరం క్షేత్రంలో మూడు నదులు కలుస్తాయి. దీన్ని త్రివేణి సంగమంగా పిలుస్తారు. ఎగువ నుంచి గోదావరి, మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నదుల ప్రవాహం రాగా కాళేశ్వరాలయంలోని ద్విలింగాలకు జలాభిషేకం చేసిన నీరు అంతర్వాహినిగా రెండు నదుల్లో కలుస్తుందని పురాణాల్లో ఉంది. 2015లో గోదావరి, 2022లో ప్రాణహిత పుష్కరాలు జరిగాయి. మరోనది సరస్వతికి పుష్కర కాలం సమీపించింది. గతంలో జరిగిన సరస్వతి పుష్కరాల్లో గోదావరి, ప్రాణహిత కలయిక ప్రవాహంలో లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఈసారి మరో 8 నెలల సమయమే ఉన్నందున అటు దేవస్థానం అధికారులు, ఇటు ఇతర అధికారులు ముందస్తు ప్రణాళికలు, ప్రతిపాదనలు సిద్ధం చేసుకుంటే భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించొచ్చు.

పూర్తి చేయాల్సిన పనులు..


అసంపూర్తిగా ఉన్న 100 గదుల విశ్రాంతి భవన నిర్మాణం

- గత ఎనిమిదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న 100 గదుల విశ్రాంతి భవన నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. నిధుల లేమితో నిర్మాణాలు ఆగిపోగా పంచాయతీరాజ్ అధికారులు గతేడాది అక్టోబర్‌లో మరో రూ.1.5 కోట్ల కోసం జిల్లా పాలనాధికారికి లేఖ పంపించారు. ఇది అందుబాటులోకి వస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.
- 2013 సరస్వతి పుష్కరాల సమయంలో ప్రయాణ ప్రాంగణం నుంచి గోదావరి వరకు ప్రధాన రహదారిని విస్తరించాలని నిర్ణయించారు. ప్రాణహిత పుష్కరాలకు ముందు ఏర్పాట్లు జరిగినా కొందరు అడ్డు తగలడంతో ఆగిపోయింది. మంత్రి శ్రీధర్‌బాబు చొరవ తీసుకుంటే విస్తరణ పనులు సకాలంలో పూర్తయి భక్తుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడదు. మంత్రి శ్రీధర్‌బాబు కాళేశ్వర క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పలుమార్లు హామీలిచ్చారు. పుష్కరాల నేపథ్యంలో అధికారులు వెంటనే అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక నివేదించాలి. తదనుగుణంగా సకాలంలో పనులను పూర్తి చేయడానికి వీలు కలుగుతుంది.
- ప్రముఖుల ఘాట్ వద్ద అంతర్వాహిణిగా సరస్వతి నది ప్రవహించి రెండు నదుల్లో కలుస్తుందని నానుడి ఉంది. ఆ ప్రాంతంలో పుష్కర ఘాట్ నిర్మాణాలు చేపట్టాలి.
- మండు వేసవిలో పుష్కరాలు రానుండగా భారీ సంఖ్యలో గోదావరి తీరంలో, ఆలయ పరిసర ప్రాంతాలలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి.
- ప్రధాన ఆలయానికి సమీపంలోని గుండం చెరువును ఆధునికీకరిస్తామని పలుమార్లు నాయకులు చెబుతున్నా పనులు సాగడం లేదు. వెంటనే గుండం చెరువును మినీ ట్యాంక్‌బండ్ మాదిరిగా నిర్మాణాలు చేపట్టాలి.


విస్తృత ప్రచారం జరగాలి

సరస్వతి నది పుష్కరాలపై దేవస్థానం అధికారులు విస్తృత ప్రచారం చేపట్టాల్సి ఉంది. దేశం నలుమూలల తెలిసేలా వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం జరగాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు. గత మంగళవారం పుష్కర ఏర్పాట్లపై దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యర్, కమిషనర్ హన్మంతరావు సమీక్ష నిర్వహించారు. ఈ నేపథ్యంలో పనుల పురోగతిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. 2013లో జరిగిన సరస్వతి పుష్కరాలకు మొదటి నాలుగు రోజులు భక్తుల సంఖ్య కేవలం వందకు పరిమితం కాగా అయిదో రోజు నుంచి పుంజుకొని వేల మంది భక్తులు పుణ్యస్నానాలు చేశారు. రాబోయే పుష్కరాలపై ఇప్పటి నుంచే ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది.

అవివాహితులకు సువర్ణావకాశం

● నేడు, రేపు ఎస్టీ (బంజార/లంబాడ) కులాల వధూవరులకు

ఈనాడు పెళ్లిపందిరి డాట్ నెట్ ఉచిత నమోదు



బాలసముద్రం, న్యూస్‌టుడే : తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి' వేదికగా సువర్ణ అవకాశం కల్పిస్తోంది. ఎస్టీ (బంజారా/లంబాడ) కులాలకు చెందిన అవివాహిత వధూవరుల కోసం ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. హనుమకొండ బాలసముద్రంలోని 'ఈనాడు' కార్యాలయంలో శని, ఆదివారాల్లో ఈ కార్యక్రమం చేపట్టింది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులు లేదా సంబంధిత కుటుంబీకులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5:30 గంటలలోపు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉచితంగా వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఫోన్ ద్వారా నమోదు చేసుకునే వారు తమ బయోడేటా, ఫొటోలను 83744 45190, 80080 02165 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపవచ్చు. మరిన్ని వివరాలకు ఇవే ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.

ముగ్గురు న్యాయమూర్తులకు పదోన్నతి

వరంగల్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు జూనియర్ సివిల్ జడ్జిలకు సీనియర్ సివిల్ జడ్జిలుగా పదోన్నతి లభించింది. వరంగల్ జిల్లా నర్సంపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పి.శిరీష పదోన్నతిపై సికింద్రాబాద్ సిటీ సివిల్ న్యాయస్థాన ప్రాంగణంలోని 14వ అదనపు కోర్టు జడ్జిగా వెళ్తున్నారు. ములుగు జిల్లా ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.రామ్మోహన్‌రెడ్డి మంచిర్యాల జిల్లా ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతిపై వెళ్తున్నారు. జనగామ సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రం అదే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో జనగామ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఇ.సుచరిత పదోన్నతిపై వస్తున్నారు. వరంగల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.సాయికుమార్ అదే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఎ.ప్రదీప్ పదోన్నతిపై వస్తున్నారు. హనుమకొండ జిల్లా ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్ పాండే అదే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా వెళ్తున్నారు. ఆమె స్థానంలో హనుమకొండ మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి జాబిశెట్టి ఉపేందర్‌రావు వస్తున్నారు. రంగారెడ్డి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వి.ఉషాక్రాంతి పదోన్నతిపై హనుమకొండ జిల్లా మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా వస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంపత్‌రావు చందన హనుమకొండ జిల్లా రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా నియమితులయ్యారు.

కాంగ్రెస్ సీనియర్ నేత నూకల నరేశ్‌రెడ్డి కన్నుమూత



మరిపెడ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నూకల నరేశ్‌రెడ్డి (73) శుక్రవారం కన్నుమూశారు. మరిపెడ మండలం పురుషోత్తమయాగూడెం గ్రామానికి చెందిన నరేశ్‌రెడ్డి వారం రోజుల క్రితం గుండె సంబంధిత సమస్యతో హైదరాబాద్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డోర్నకల్ శాసనసభ నియోజకవర్గంలో క్రియాశీల రాజకీయాల్లో ఉంటూ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు ప్రధాన ప్రత్యర్థిగా రాజకీయాల్లో కొనసాగారు. తెలంగాణ ఉద్యమ సమయంలో భారాసలో చేరారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

● పురుషోత్తమాయగూడెంలోని ఏరువాక వ్యవసాయ క్షేత్రంలో నరేష్‌రెడ్డి అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్, జిల్లా ఎస్పీ రాంనాథ్ కేకన్ అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయన మృతి పట్ల ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలు సంతాపం ప్రకటించారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

కవుల రాగమై .. జీవన గానమై..!

● బతుకమ్మ పాటల్లో గొప్ప సందేశం

ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూలను పూజించే అత్యంత పవిత్రమైన పండగ బతుకమ్మ. మహిళలంతా రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను పూజిస్తూ.. ఆటపాటలతో మురిసిపోతారు. ఆ పాటల వెనుక ఎంతో అర్థముంది. ఇవి జానపదాలతో పాటు కవులు, గాయకుల కలం నుంచి జాలువారి ప్రజలను అలరిస్తున్నాయి.. పాటల చరణాల్లోని బావుకత, పూల సొగసుల వర్ణన, జీవన పరమార్థం, ప్రకృతి దేవతల ఆరాధన, సందేశాలు.. ఇలా ఎన్నో దాగి ఉన్నాయి.. మానుకోట, న్యూస్‌టుడే


హనుమకొండ భీమారంలోని ఎస్సార్ విశ్వవిద్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు

ఆప్యాయత..

మా ఇంటి ఆడపడుచువు
అమ్మా.. ఓ బతుకమ్మా
మా పల్లె పూల జల్లువు
అమ్మా.. బతుకమ్మా..
తెలంగాణ మురిసె..
మా చెల్లెలంతా.. మా అక్కలంతా.. మా అమ్మలంతా
బతుకమ్మలాడా..'



- మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రజాగాయకుడు, వాగ్గేయకారుడు గొడిశాల జయరాజు ఈ పాట రాశారు.

● తన పాటలో బతుకమ్మ వేడుకల వేళ ఆడపడుచుల ఆనందాన్ని.. పూల పర్వదిన సౌందర్యాన్ని వర్ణించారు.

పూల తహతహ..!

'బతుకమ్మ పండగొస్తే
పూవులన్నీ నవ్వుతాయి..
గడ్డిపూలు గంతులేస్తయ్.. తంగేడు
పూలు తెంపమంటయ్
నునుపుగున్న గునుగు పూలు
గుసగుసలు చెబుతాయి
చెరువులోని తామరలు
తెంపమంటూ తొంగుతాయి
బతుకమ్మ పండుగొస్తెరా.. మా పల్లె తల్లి
పుత్తడి బొమ్మయి పోవురా..
నా తెలంగాణ తల్లి పుత్తడి బొమ్మయి పోవురా..



మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన గాయకుడు, గేయ రచయిత కందుల ప్రేంకుమార్ ఈ పాట రాశారు.

● ప్రకృతిలోని రంగు రంగుల పూలు బతుకమ్మలో తమను కూడా చేర్చాలని.. పేర్చాలని.. కోరుకుంటాయని ప్రేంకుమార్ పూల తహతహలను వర్ణించారు. ఒక్కో పువ్వును వర్ణించారు.

ఊరూవాడ కలిసేలా..



'సింగిడిలో.. సింగిడిలో
రంగులన్నీ నేలకొచ్చేనా..
రంగు రంగు పువ్వులయి
ఏకమయ్యేనా.. చెరువంతా
మెరిసేనా..
ఊరువాడా కలిసి.. బతుకమ్మలా పేర్చి
ముత్తయిదువులంతా కలిసి గౌరమ్మను కొలిసెనే..
అందాల పూవులన్నీ ఊయలలూగెనా
మందార పూలన్నీ కోలాటమాడెనా
తామర పువ్వులన్నీ తనువు తడిసెనా
గులాబీ పువ్వులన్నీ పొద్దయిపొడిసెనా
ఊరువాడా కలిసి మొక్కులన్నీ తీర్చి..

● మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు, గాయకుడు అక్షరం ప్రభాకర్ బతుకుతెరువునిచ్చే బతుకమ్మ అంటూ పాటలు రాశారు. నింగిలోని ఇంద్రధనుస్సు బతుకమ్మను చూడడానికి ఒక్కొక్క పూవుగా నేలకు వచ్చినట్లు ఈ పాటలో వివరించారు. పండగ వేళ ఊరంతా ఎలా ఆనందంలో తేలిపోతారో తెలియజేశారు.

సామూహిక అత్యాచార నిందితుల అరెస్టు


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

మట్టెవాడ, న్యూస్‌టుడే: వరంగల్ నగరంలో యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు యువకులను ఇంతేజార్‌గంజ్ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ అరెస్టు వివరాలు వెల్లడించారు. భూపాలపల్లి హనుమాన్‌నగర్‌కు చెందిన తాటి శివరాజ్ కుమార్, పుట్టపాక శరత్ స్నేహితులు. శరత్ ద్వారా బాధిత యువతి మూడు సంవత్సరాల క్రితం శివరాజ్‌కుమార్‌కు పరిచయమైంది. నర్సంపేట లక్నేపల్లిలోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో శివరాజ్‌కుమార్, గోదావరిఖనికి చెందిన కొడం వివేక్ బీటెక్ చదువుతున్నారు. ప్రధాన నిందితుడు శివరాజ్‌కుమార్, గోదావరిఖనికి చెందిన కూచన మణిదీప్ కుటుంబాల మధ్య స్నేహం ఉంది. ఈక్రమంలో శివరాజ్‌కుమార్ ఇటీవల బాధిత యువతికి తన ప్రేమ విషయాన్ని తెలుపగా ఆమె నిరాకరించి స్నేహితులుగా ఉందామని చెప్పింది. దీంతో యువతిని ఎలాగైనా శారీరకంగా లోబరుచుకోవాలని శివరాజ్‌కుమార్ ఆలోచించాడు. గత నెల 15న శివకుమార్, వివేక్‌లను కలవడానికి మణిదీప్ బిట్స్ కళాశాలకు వచ్చాడు. ముగ్గురు కలిసి ఉండగా శివకుమార్ తన కోరికను వెలిబుచ్చాడు. దీంతో ముగ్గురు కలిసి నగర శివారులో యువతి చదువుతున్న కళాశాలకు వచ్చారు. బాధిత యువతికి శివరాజ్‌కుమార్ ఫోన్ చేసి గుడికి వెళ్దామని చెప్పి కారులో ఎక్కించుకున్నారు. అప్పటికే కారులో మరో ఇద్దరు యువకులు మణిదీప్, వివేక్‌లను చూసి గుడికి వచ్చేందుకు నిరాకరించింది. దీంతో ఆమెను బలవంతంగా ఎక్కించుకున్నారు. వరంగల్ పోచమ్మ మైదాన్‌లోని ఓ మద్యం దుకాణంలో బీర్లు కొనుగోలు చేశారు. అక్కడి నుంచి వరంగల్ కూరగాయల మార్కెట్ వద్ద గల ఓ లాడ్జికి తీసుకెళ్లారు. యువతికి మద్యం తాగించి లాడ్జిలో ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు. యువతి అరుపులతో లాడ్జి సిబ్బంది వచ్చి ప్రశ్నించగా గది నుంచి యువతి, ముగ్గురు యువకులు వెళ్లిపోయారు. అత్యాచారం విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తామని ఆమెను బెదిరించారు. కళాశాలలో పరీక్షల అనంతరం ఇంటికి వెళ్లిన యువతి అత్యాచారం విషయాన్ని తల్లికి చెప్పగా ఈ నెల 1న ఇంతేజార్‌గంజ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఐ మచ్చ శివకుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. గురువారం నర్సంపేట మహేశ్వరం వెళ్లే ఓ కచ్చా రోడ్డు వద్ద ముగ్గురు యువకులను అరెస్టు చేశారు. మణిదీప్‌కు చెందిన కారు, మూడు చరవాణులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పోషకాలున్న ఆహారంతో ఆరోగ్యం

ములుగు, న్యూస్‌టుడే: మనం తీసుకునే ఆహారమే మనల్ని కాపాడుతుందని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ అరుణ జ్యోతి అన్నారు. శుక్రవారం దత్తత గ్రామమైన ములుగు మండలం చిన్నగుంటూరుపల్లిలో కోళ్ల దాణా, కూరగాయల విత్తనాల పంపిణీ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ శంకర్, డాక్టర్ సౌమ్యలతో కలిసి ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లోని మహిళా రైతులు రక్తహీనతతో బాధపడుతుంటారని, అలాంటి పరిస్థితులు రావడానికి మనం తీసుకునే ఆహారమే కారణమన్నారు. రక్తహీనతను అధిగమించేందుకు వివిధ రకాల కూరగాయలు, గుడ్లు, మాంసం వంటివి తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో ఆకుకూరలు, కూరగాయల మొక్కలు పెంచాలన్నారు. విటమిన్లు సమృద్ధిగా ఉండే పోషకాలున్న ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వంద మంది మహిళలకు సుమారు రూ.2 లక్షల విలువైన కోళ్ల దాణా, 10 రకాల కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. రైతు సంఘం అధ్యక్షుడు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు 'రాగిజావ' కానుక

దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 1వ తేదీ నుంచి రాగిజావ అందించనుంది. సద్గురు మధుసూదన్ సాయి సారథ్యంలో బడి 40 శాతం ప్రభుత్వ ఆర్థిక మద్దతుతో కేంద్రాల చిన్నారులకు రాగిజావ అందించనుంది. ఇందుకోసం నాణ్యత గల రాగి పొడి, బెల్లం సేకరించి పొట్లాలుగా తయారుచేసి దీపావళి కానుకగా సరఫరా చేయడానికి సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు సన్నాహాలు చేస్తోంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి..

☛ కేంద్రాలకు వెళ్లే చిన్నారులకు సరైన పోషకాలు అందడం లేదని గ్రహించిన నేపథ్యంలో పోషక విలువలున్న జావ అందించనున్నారు. ఇందుకోసం కిలో చొప్పున పొట్లాలు తయారుచేస్తున్నారు. ప్రతి విద్యార్థికి పది గ్రాముల చొప్పున రాగిపొడి బెల్లం వేడినీళ్లలో కలిపి అందించనుంది. ఇందులో పసుపు, బియ్యపు పిండి, దాల్చిన చెక్క సహా ఏడు రకాల ధాతువులను కలిపి చిన్నారులకు ఇస్తారు.

☛ అలాగే విద్యార్థులు ఇంటికి వెళ్లే క్రమంలో వేడి నీళ్లలో బెల్లంతో కూడిన ద్రావణాన్ని తాగించాలి. తీయదనంతో ఇష్టంగా తాగుతారని నిపుణులు చెపుతున్నారు.

☛ ప్రతినెలా 15వ తేదీకల్లా మండలాల వారీగా కేంద్రాల విద్యార్థుల సంఖ్యను సేకరించి సరకుల రవాణాను మండల వనరుల కేంద్రాలకు తరలిస్తారు. అక్కడి నుంచి విద్యాలయాల బాధ్యులు తమ ప్రాంతాలకు తరలించాలి.

వారానికి మూడు రోజులు

ప్రభుత్వ పాఠశాలల్లో గత రెండు నెలలుగా నిలిచిపోయిన రాగిజావ సరఫరాను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నిరుటి విద్యాసంవత్సరం వరకే ఒప్పందం ఉన్నా విద్యార్థులు ఇబ్బంది పడొద్దని జూన్, జులై మాసాల్లో నిర్వాహకులు అందించారని సమాచారం. పలు విజ్ఞప్తులు పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం వెంటనే వారానికి మూడు రోజుల పాటు శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు ద్వారా అందించాలని ఆదేశించింది. దసరా సెలవుల అనంతరం ఇవ్వనున్నట్లు సమాచారం.

పోషక విలువలు ఇలా..

ప్రతి వందగ్రాముల రాగుల్లో 328 క్యాలరీల శక్తి ఉంటుంది. ఐరన్ 3.9 మిల్లీ గ్రాములు, 11 మి.గ్రా. సోడియం, 344 మి.గ్రా. క్యాల్షియం, 408 మిల్లీ గ్రాముల పొటాషియం ఉంటాయి. చిన్నపిల్లల ఎముకలు ధృడంగా ఉండడానికి క్యాల్షియం, రక్తహీనత తగ్గించడానికి పీచు పదార్థాలు ఉండడంతో విద్యార్థి ఉత్సాహంగా ఉంటారని నిపుణులు చెప్పారు.



సిద్ధమవుతున్న పొట్లాలు

దసరా సెలవుల నాటికే సన్నాహాలు పూర్తి చేస్తాం..



- ఆనంద్ కదాలి, ప్రధాన కార్యదర్శి, శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు

రాగిజావ అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో 21 లక్షల మందికి రాగిజావ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. దసరా సెలవులు పూర్తయ్యే నాటికి సన్నాహాలను పూర్తిచేసి నవంబర్ ఒకటి నుంచి సరఫరా చేస్తాం. నిత్యం అనుశీలన చేస్తాం. ఏ ఒక్క విద్యార్థి ఆకలితో బడికి రావొద్దన్నదే ట్రస్టు ప్రధాన ధ్యేయం. దాతల సహకారంతో నిర్వహిస్తుండటం గొప్ప సంతృప్తినిస్తుంది.

మేమున్నాం.. మీకు తోడుగా

వాజేడు: 8008573708, వెంకటాపూర్: 9440692140
ఏటూరునాగారం: 9440184979, వెంకటాపురం: 8008624242

సమస్యలపై మధ్యవర్తులను ఆశ్రయించొద్దు

ములుగు టౌన్, న్యూస్‌టుడే: సమస్యలపై ప్రజలు నేరుగా ఠాణాకు వచ్చి ఫిర్యాదు చేయాలని మధ్యవర్తులను ఆశ్రయించొద్దని సీఐ శంకర్ అన్నారు. జిల్లా పోలీసు అధికారి ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు ములుగు మండలం బరిగలోనిపల్లి గ్రామ పంచాయతీలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ హాజరై మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారంలో కృషి చేస్తామన్నారు. గ్రామంలో నేరాలను తగ్గించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ములుగు, న్యూస్‌టుడే: అక్టోబర్ 18న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న కల్లుగీత కార్మిక సంఘం 67వ వార్షికోత్సవ సదస్సు కరపత్రాలను శుక్రవారం ములుగు మండలం జంగాలపల్లిలో ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవిగౌడ్, జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, నాయకులు పులి రమేష్, సురేందర్, సత్యనారాయణ, శ్రీకాంత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించాలని మంత్రికి వినతి



ములుగు, న్యూస్‌టుడే: ములుగు రామాలయం ప్రాంగణంలోని దుర్గామాత ఉత్సవాల నిర్వహణ ప్రదేశానికి ప్రహరీతో పాటు వేదిక నిర్మించాలని కోరుతూ దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి వెంటనే అంచనాలు తయారు చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు మంత్రి సీతక్క ములుగులోని రామాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి వస్త్రాలు సమర్పించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి, కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

ములుగు: అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంత్రి సీతక్కకు ములుగులో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ఛైర్మన్ ముంజాల భిక్షపతి మాట్లాడుతూ.. ములుగు పట్టణంలో చాలా మంది పేదలు అద్దె గృహాల్లో నివాసం ఉంటున్నారని తెలిపారు. అలాంటి వారందరికీ ఇళ్లు ఇవ్వాలన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

రామప్పలో పర్యాటకుల సందడి



వెంకటాపూర్, న్యూస్‌టుడే: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రామప్పలో శుక్రవారం పర్యాటకుల సందడి నెలకొంది. దసరా సెలవులు పురస్కరించుకొని అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం ప్రారంభమైన భక్తుల రాక సాయంత్రం వరకు కొనసాగింది. రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. కుటుంబ సమేతంగా రామప్ప పరిసరాల్లో ఆనందంగా గడిపారు.

బాల వికాస సేవలు అభినందనీయం



నీటి శుద్ధికేంద్రం శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డీసీసీ అధ్యక్షుడు అశోక్, తదితరులు

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు కేంద్రాలు పల్లెల్లో ప్రగతికి బాటలు వేస్తున్నాయి. ప్రత్యేకంగా తాగునీటి శుద్ధి కేంద్రాలపై దృష్టి సారించి స్వచ్ఛమైన జలాన్ని అందిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. గోవిందరావుపేట మండలం బుస్సాపూర్ గ్రామంలో శుక్రవారం బాలవికాస మహిళా కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి కేంద్రాన్ని అశోక్ ప్రారంభించి మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి విశేష కృషి చేస్తుందన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, ఎంపీడీవో జి.జవహర్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి జితేందర్ రెడ్డి, స్వచ్ఛంద సంస్థ ఎండీ మదన్‌మోహన్‌రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ బాలమోహన్‌రెడ్డి, సహకార బ్యాంకు అధ్యక్షుడు పి.ఎల్లారెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.మాధవరెడ్డి, బుస్సాపూర్ మాజీ ఉపసర్పంచి బి.దేవేందర్‌రెడ్డి, నాయకులు జె.సోమయ్య, సీహెచ్.క్రాంతికుమార్, పి.యాదగిరి, రాజబాబు, జి.సురేశ్, ఎం.రాజశేఖర్‌రెడ్డి, బి.శివుడు, డి.భరత్, టి.శివ, బాల వికాస మహిళా కేంద్రం సభ్యులు పలువురు పాల్గొన్నారు.



పాలంపేటలో..



వెంకటాపూర్ మండలం కేశవపూర్‌లో



గోవిందరావుపేటలోని ఎన్‌టీఆర్ కాలనీలో



పస్రా శ్రీ రామాలయంలో..

నేత్రపర్వంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా నేత్రపర్వంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారు గాయత్రీదేవి, బాలత్రిపురసుందరి దేవి, లక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా మండపాల్లో అధిక సంఖ్యలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.
– న్యూస్‌టుడే, యంత్రాంగం



మంగపేటలో కుంకుమపూజ



ములుగు పట్టణంలో..



కమలాపురం గ్రామంలో..

అడవి పందిని వేటాడిన కేసులో జరిమానా

కమలాపురం(మంగపేట), న్యూస్‌టుడే: అడవి పందిని వేటాడి చంపిన కేసులో ముగ్గురికి జరిమానా విధించినట్లు మంగపేట డీఆర్వో కోటేశ్వర్ తెలిపారు. శుక్రవారం మంగపేటలో ఆయన వివరాలు వెల్లడించారు. కమలాపురం శివారులో సెప్టెంబరు 25న అదే గ్రామానికి చెందిన రమేశ్, భీముడు, సంపత్‌లు అడవిపందిని చంపారనే సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, సంబంధిత జంతువు మాంసం లభ్యమైందన్నారు. వీరిని అదుపులోకి తీసకుని విచారించి 29న కేసు నమోదు చేశామన్నారు. శుక్రవారం ములుగు జిల్లా అటవీఅధికారి రాహుల్ కిషన్ జాదవ్ ఈ కేసులో నిందితులకు రూ.50 వేల జరిమానా విధించారని తెలిపారు. ఎవరైనా వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇసుక లారీ పట్టివేత

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని ఏటూరునాగారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై షేక్ తాజుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం మండలంలోని ముల్లెకట్ట గోదావరి బ్రిడ్జి వద్ద నుంచి 40 టన్నుల ఇసుక లోడుతో ఉన్న లారీ అతివేగంగా ముల్లెకట్ట నుంచి హనుమకొండ వైపునకు వెళుతోంది. వెంకటాపురం మండలంలోని అంకన్నగూడెం ఇసుక క్వారీ నుంచి ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్నారు. డ్రైవర్ అతివేగంగా వెళ్తుండగా, అనుమానంతో తనిఖీ చేయగా ఎలాంటి ఆధారాలు చూపలేదు. దీంతో వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మొక్కల సంరక్షణ తప్పనిసరి



ప్రజావేదికలో పాల్గొన్న డీఆర్‌డీఏ ఏపీడీ వెంకటనారాయణ

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: పలు గ్రామ పంచాయతీల పరిధిలో నాటిన కొన్ని మొక్కలు పాడైపోయాయని సామాజిక తనిఖీ బృందం సభ్యులు తమ దృష్టికి తెచ్చారని, వాటి స్థానంలో మళ్లీ మొక్కలు నాటి సంరక్షించాలని డీఆర్‌డీఏ ఏపీడీ వెంకటనారాయణ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గోవిందరావుపేట మండలంలో ఇటీవల సామాజిక తనిఖీ బృందాలు పలు గ్రామ పంచాయతీల్లో తనిఖీలు నిర్వహించి నివేదకను జిల్లా ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశాన్ని ఎంపీడీవో జవహర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టే పనుల్లో నిబంధనలకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలు పాటించేలా పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపాలన్నారు. మండలంలోని 18 పంచాయతీల్లో పని చేస్తున్న పలువురు పంచాయతీ కార్యదర్శులకు రూ.52,807 అపరాధ రుసుం విధించారు. ఇక ముందు పనుల్లో తప్పిదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా విజిలెన్స్ అధికారి సాంబయ్య, ఎస్‌టీసీఓ కె.కిష్టయ్య, ఏపీఓ ప్రసూన, సోషల్ ఆడిట్ ఎస్ఆర్పీ, కొమురయ్య, మండల ఈసీ మనోహర్, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రస్థాయి సహాయకులు పాల్గొన్నారు.

'మాదిగలను విస్మరిస్తున్న ప్రభుత్వం'



ప్రసంగిస్తున్న ఎంఎస్‌పీ రాష్ట్ర ఇన్‌ఛార్జి ఇరుగుపైడి మాదిగ

ములుగు, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా డీఎస్సీ ఫలితాలను విడుదల చేయడం అన్యాయమని ఎంఎస్‌పీ రాష్ట్ర ఇన్‌ఛార్జి ఇరుగుపైడి మాదిగ అన్నారు. శుక్రవారం ములుగులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో హామీ ఇచ్చి సీఎం రేవంత్‌రెడ్డి మాట మార్చడం తగదన్నారు. రేవంత్‌రెడ్డి వర్గీకరణ అమలు చేయకుండా డీఎస్సీ ఫలితాలు విడుదల చేయడమంటే మాదిగలను విస్మరించడమేనని తెలిపారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. మాదిగలను విస్మరించినందుకు నిరసనగా ఈనెల 9న జిల్లా కేంద్రంలో నల్ల జెండాలతో ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు, నాయకులు గుగ్గిళ్ల సాగర్, గజ్జెల ప్రసాద్, సాంబశివరావు, రవిందర్, స్వామి, చంద్రమౌళి, బలరాం, కడారి సాంబయ్య, రాము, లక్ష్మణ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాటమయ్య కిట్లను సద్వినియోగం చేసుకోవాలి

ములుగు, న్యూస్‌టుడే: కల్లు గీత కార్మికుల ప్రమాదాల నివారణ కోసం ప్రభుత్వం సమకూర్చిన కాటమయ్య రక్షణ కిట్లను ప్రతి గీత కార్మికుడు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి రవీందర్ రెడ్డి అన్నారు. ములుగు మండలం జంగాలపల్లిలో ట్రేనర్‌లతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రక్షణ కిట్లను వాడుకోవాలని సూచించారు. 60 మందికి శిక్షణ ఇచ్చారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌కుమార్, ట్రైనర్ తాళ్లపల్లి నర్సయ్య, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంతోనే దేశ భవిత



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ బండారి కుమార్

వెంకటాపురం, న్యూస్‌టుడే: యువత సన్మార్గంపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని వెంకటాపురం సీఐ బండారి కుమార్ అన్నారు. వెంకటాపురం మండల కేంద్రంలోని కాఫెడ్ క్రీడా మైదానంలో వెంకటాపురం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను తహసీల్దారు పి.లక్ష్మీరాజయ్యతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగం అధికం కావడంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. విద్యార్థులు, యువకులు అధికంగా ఈ డ్రగ్స్‌కు బానిసలుగా మారి భవిష్యత్తును చీకటిమయం చేసుకుంటున్నారని తెలిపారు. తల్లిదండ్రుల ఆశయాలు, మన లక్ష్యాలను నెరవేర్చుకునేందుకు గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వాలు క్రీడలను మరింత ప్రోత్సహిస్తున్నాయని, చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. వెంకటాపురం, వాజేడు, ఏటూరునాగారం, మంగపేట మండలాల్లోని క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిర్వాహకులు సమష్టిగా ఈ పోటీలను ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని తెలిపారు. స్నేహపూర్వక వాతావరణంలో క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. గంజాయిని పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు ప్రతీ ఒక్క యువకుడు సామాజిక బాధ్యతగా గుర్తించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతిరావు, ఎఫ్ఆర్‌వో చంద్రమౌళి, ఉప తహసీల్దారు మహేందర్, పీఏసీఎస్ ఛైర్మన్ చిడెం మోహన్‌రావు, న్యాయవాది, నిర్వహణ కమిటీ సభ్యుడు చిడెం రవికుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, భారాస మండలాధ్యక్షుడు గంపా రాంబాబు, భాజపా జిల్లా కార్యదర్శి రఘురాం, నియోజకవర్గ కన్వీనర్ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

'ఉద్దేశపూర్వకంగానే గద్దెల కూల్చివేత'



వై జంక్షన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న భాజపా శ్రేణులు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: భాజపా, ఛత్రపతి శివాజీ గద్దెల కూల్చివేతకు నిరసనగా భాజపా ఆధ్వర్యంలో శుక్రవారం ఏటూరునాగారంలోని వై జంక్షన్ వద్ద నాయకులు ధర్నా చేపట్టారు. భాజపా మండల అధ్యక్షుడు గాడిచర్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్దేశపూర్వకంగానే కొన్ని శక్తులు భాజపా, ఛత్రపతి శివాజీ మహారాజ్ గద్దెలను కూల్చారని ఆవేదన వ్యక్తం చేశారు. గద్దెలను కూల్చివేసిన దుండగులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం కొత్త గద్దె నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, కృష్ణాకర్‌రావు, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యం, వినుకొల్లు చక్రవర్తి, ఈక మహాలక్ష్మి, సంపత్, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజిని అవమానించడం సరికాదు

తాడ్వాయి: ఛత్రపతి శివాజిని అవమానించడం తగదని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి భర్తపురం నరేష్ పేర్కొన్నారు. తాడ్వాయిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో భాజపాకు పెరుగుతున్న ఆదరణను చూడలేక అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఏటూరునాగారం వైజంక్షన్‌లో శివాజీ జెండా గద్దెను కూల్చివేశారని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి దోషులను గుర్తించి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

పోడు రైతులకు హక్కు పత్రాలివ్వాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి

తాడ్వాయి, న్యూస్‌టుడే: జిల్లాలోని పోడు రైతులందరికి అటవీహక్కు పత్రాలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. తాడ్వాయి మండలంలోని లింగాల గ్రామంలో శుక్రవారం పార్టీ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని వేలాది మంది రైతులు దరఖాస్తులు చేసుకొంటే కొద్దిమందికి మాత్రమే అటవీ హక్కు పత్రాలు అందించడం జరిగిందన్నారు. కేవలం లింగాల ప్రాంతంలోనే వందల సంఖ్యలో అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రైతుల తరుపున సీపీఎం ఉద్యమం కొనసాగిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి దుగ్గి చిరంజీవి, నాయకులు ఊకె ప్రభాకర్, నాగేశ్వర్‌రావు, జన్ను ఎల్లయ్య, పెనక కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు

ములుగు, న్యూస్‌టుడే: మహిళలు, చిన్నారులు శుక్రవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ములుగులోని జిల్లా కోర్టు ఆవరణలో ములుగు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు జరిగాయి. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్‌వీపీ సూర్యచంద్రకళ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్యలాల్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రామమోహన్‌రెడ్డి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జె.సౌఖ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె.సునిల్‌కుమార్, పీపీ శ్యామ్‌ప్రసాద్, న్యాయవాదులు కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వాజేడు: వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో బతుకమ్మ సంబురాలు జరిగాయి. ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్య సిబ్బంది బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఆటపాటలతో ఉత్సాహంగా నిర్వహించారు. వైద్యులు మహేందర్, మధుకర్, జ్ఞానస, యోషిత, సిబ్బంది వెంకటరమణ, కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద



ములుగులోని జిల్లా కోర్టు ఆవరణలో..